“బాబూ నీ ఫ్రెండు మన వంశగౌరవము, మానమర్యాదలు మంట గలిపేలా ఉన్నాడు బాబూ” అరుస్తూ అంది పార్వతమ్మ.

“వెధవ స్నేహితుడు, వెధవ సాంప్రదాయాలు” నొసలు మీద బాధగా కొట్టుకున్నాడు పర్వతాలరావు.

బుచ్చిబాబు గుండెలు బాదుకుంటూ సీత, సుందర్‌ల మధ్యకి ఒక్క గెంతు గెంతి నిల్చున్నాడు “ఒరేయ్....సుందర్ ఏంట్రా ఇది సిల్లీగా” అన్నాడు.

“స్నేహితుల బుగ్గ పై ముద్దు పెట్టుట మా ఆషారము” అన్నాడు సుందర్.

“నీ ఆచారం మండా.....తను నాక్కాబోయే పెళ్ళాంరా.... ఇక్కడ అలాంటి అచారాలు పనికిరావు”

“నీ ఫ్రెండ్‌కి నన్ను చూపించావ్ కదా.. నేనింక వెళ్ళనా బుచ్చిబాబు?” సుందర్‌ని భయం భయంగా చూస్తూ అడిగింది సీత .

“చూసావా...నీ ప్రవర్తనతో సీత ఎంత ఠారెత్తిపోయిందో?” అన్నాడు బుచ్చిబాబు సుందర్‌తో.

“సారీ బుష్షీ! అచట అమెరికాలో స్నేహితులకు ముద్దులు పెట్టి పెట్టీ అలవాటు అయినది . నువ్వు భయపడకు సిస్టర్....నేను ఇచట సంప్రదాయముల ప్రకారం నడుషుకొందును” అన్నాడు సుందర్.

“రక్షించావ్ సరేగాని సీత ఎలా ఉంది?”

“షీట?”

“షీట కాదు! సీత..... సీత!”

“అదే షీట! షానా బాగుంది. వెరీ నైస్ సెలక్షన్” అన్నాడు సుందర్. వీళ్ళు కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. పార్వతమ్మ సీతని భోజనానికి ఉంచేసింది. భోజనం చేసిన తర్వాత సీత అందరి దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

రాత్రి పన్నెండు దాకా సుందర్ పెళ్ళి గురించి వ్యతిరేకంగా మాట్లాడి బుచ్చిబాబు బుర్ర తినేసాడు.

“షీట షాలా షక్కని పిల్ల! మీ మధ్య షాలా లవ్ కలదు. కానీ మీరు మ్యారేజ్ షేష్కుని మీది లవ్ షంపేష్కుంటున్నారు. మొగుడూ పెండలాలుగా మారిపోయి ఏల్లప్పుడు దెబ్బలాడు కొనవలెనని నిర్ణయం తీషుకున్నారు. హంత షక్కటి పిల్లతో ఎప్పుడూ దెబ్బలాడుకొనుట నీ కిష్టమా?” అడిగాడు సుందర్.

“అయితే పెళ్ళి చేసుకోకుండా సీతకి దూరంగా వుండలంటావా?” అడిగాడు బుచ్చిబాబు.

“నేను అటుల షెప్పలేదే! మీరిద్దరూ కలసి వుండుడు”

“పెళ్ళి చేసుకోకుండా అదెలా కుదుర్తుందిరా బాబూ”

"కుదురును! అమెరికాలో ఇది షాలా మామూలు విషయం యూనో?"

"కానీ ఇండియలో అలా కుదరదు"

"ఇండియాలో ఇదివరకు మొగుడు పోయిన మెడల మరల పెండ్లి షేషుకోనిరా? లేదు. మరి ఇప్పుడు? ఇండియాలో ఇదివరకు నచ్చిన అమ్మాయిని ఎచటకైన తీష్కునిపోయి పెండ్లి షేష్కునిన యడల లేషి పోయినరు అనెడివారు. ఇప్పుడు లవ్ మ్యారేజ్ అంటున్నారు. ఇండియాలో ఇదివరకు స్త్రీ ఇంటి గుమ్మం దాటి వెళ్ళునది కాదు. కానీ ఇప్పుడు? మగవాడితో షమానంగా ఉద్యోగం షేయుషున్నది. ఏదైన కొత్త విష్యము మొదలుషేయువారు విమర్షలకు గురి కాబడుదురు. ఒక మంషి పనిని నువ్వు మొదలు బెట్టుము. షమాజము కోరకు నీ ప్రేమను షంపుకోనకుము"

"ఆ!" బాధగా జుట్టు పీక్కున్నాడు బుచ్చిబాబు.

*　　　*　　　*

మర్నాడు-

సాయంత్రం రైల్వేస్టేషన్‌లో..

సుందర్ రైల్లో కిటికీ దగ్గర కూర్చుని వున్నాడు. బుచ్చిబాబు ప్లాట్ ఫారం మీద నిలబడి ఉన్నాడు. "నెను మా షోంట ఊరికేళ్ళి తిరిగి అమెరికా వెళ్ళునప్పుడు మళ్ళీ హైదరబాద్‌కి వచ్చి రెండు రోజులు నీతో గడిపి పోయెదను" అన్నాడు సుందర్.

"అయితే నా పెళ్ళికి రావా?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు బుచ్చిబాబు.

అంతకంటే ఎక్కువగా ఆశ్చర్యపోతూ సుందర్ బుచ్చిబాబుని చూసాడు "ఏమిటీ? పెండ్లిమాట నువ్వు ఇంకనూ మానలేదా?"

బుచ్చిబాబు బుర్ర గోక్కున్నాడు.

"ఏంటో నా మతి పోగొడ్తున్నావ్"

"నీ కర్మ కాలినచో పెండ్లి షేషుకోనుము శుభలేఖ పంపిన ఆలోచించెదను. అవునుగానీ టైము అయినను ట్రయిను ఏలకదలదు? అమెరికాలో ఇటుల చేసిన షూట్ చేయుదురు" అలా అంటుండగానే గ్రీన్ సిగ్నల్ పడింది. గార్డు పచ్చ జండా ఊపాడు. రైలు కూత పెట్టి ముందుకు కదిలింది.

దూరమవుతున్న రైల్లోంచి సుందర్ చెయ్యి పెట్టి ఊపుతూ "షిటను ప్రేమింషుము....పెండ్లి షేష్కుకోనకము..." అని అరిచాడు.

ఆ రాత్రి బుచ్చిబాబుకి నిద్ర పట్టలేదు.

0　　　0　　　0

ఉదయం కాఫీ తాగుతూ న్యూస్ పేపర్ చదువుతున్నాడు బుచ్చిబాబు. ఫ్రంట్ పేజీలో మెయిన న్యూస్ మొత్తం చదివాక పేజి తిప్పాడు. రెండో పేజీలో ఎడిటోరియల్ చదివాడు. మూడో పేజీలో అన్నీ చావు వార్తలు-లారీ గుద్ది వృద్దుడి మరణం, ఫ్యానుకు ఉరేస్కుని యువకుడు ఆత్మహత్య, కట్నం తేలేదని యువతిని కిరోసిన్ పోసి తగలెట్టిన అత్తామామలు....అన్నీ ఇలాంటి వార్తలే!

ఛీ ఛీ ...ఏం న్యూస్ పేపరో, ఏం వార్తలో... అనుకుంటూ పేపర్ తిప్పబోయిన బుచ్చిబాబు ఠక్కున ఆగిపోయాడు పేపర్లోని ఆ ఫోటో దగ్గర "పట్టపగలు నడిరోడ్డు మీద కత్తులతో పొడిచి యువకుడి దారుణ హత్య" అన్న హెడ్డింగ్‌తో వార్త వుంది. బుచ్చిబాబు గబగబా ఆ వార్తని చదివాడు.

స్థానిక రాజకీయ నాయకుడు రాజేంద్రని ఎవరో తెలియని వ్యక్తులు నగరం నడిబొడ్డున వున్న అబిడ్స్ సెంటర్‌లో కత్తులతో పొడిచి చంపారు.

అతన్ని హత్య చేయడానికి కారణాలు తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేస్కుని హంతకులకై గాలిస్తున్నారు"

వార్త చదివిన బుచ్చిబాబు ఆ ఫోటోవంక పరిశీలనగా చూసాడు. ఆ ఫోటోలోని వ్యక్తి ఎక్కడో చూసినట్లుగా అనిపించింది బుచ్చిబాబుకి. అందుకే పేజీ తిప్పబోయి ఆగి వార్తని అలా గబగబా చదివాడు. ఎక్కడ?....ఎక్కడో చూసాడు ఆ వ్యక్తిని??

ఆ ఫోటోలోని వ్యక్తిని డైరెక్టుగా చూళ్ళేదు బుచ్చిబాబు ఆ వ్యక్తి ఫోటోని మాత్రం చూశాడు మినిస్టర్ మిన్నారావ్ ఇంట్లో. ఆ రోజు తన ట్రాన్స్‌ఫర్ ఆపుకోవడానికి వెంకట్రావ్‌తో కలిసి మినిస్టర్ మిన్నారావ్ ఇంటికి వెళ్ళినప్పుడు తామెవరో తెలుసుకోకుండా ఆ ఫోటోలోని వ్యక్తి రాజేంద్ర ఫోటోని తమకి ఇచ్చి అతన్ని చంపితే లక్ష రూపాయలిస్తానని అన్నాడు మినిస్టర్ మిన్నారావ్.

అయితే రాజేంద్రని చంపింది మినిస్టర్ మిన్నారావ్ మనుషులేనా?

అంతే అయి వుంటుంది. వాడేగా రాజేంద్రని చంపడానికి ప్లాన్ చేసింది?

హమ్మో!..... మిన్నారావ్ యమడేంజరస్ మనిషన్నమాట! !

బుచ్చిబాబు గుండెలమీద చేతులు వేస్కున్నాడు.

0 0 0

సాయంత్రం......

ఆరుగంటలు కావస్తోంది. బుచ్చిబాబు సీత ట్యాంక్‌బండ్ మీద సిమెంట్ బెంచ్ మీద

కూర్చున్నారు.

"ఆ మినిస్టర్ మిన్నారావు చూసావా? మనిషిని చూస్తే అలా అనిపించడు. ఒక నిండు ప్రాణాన్ని ఎలా బలి తీసుకున్నాడో?" అన్నాడు బుచ్చిబాబు.

సీత బుచ్చిబాబు వేపు విసుగ్గా చూసింది.

"ఇంక ఆ సోది ఆపుతావా? వచ్చిన దగ్గర్నుండి ఆ విషయాన్నే చెప్తున్నావ్? నన్ను ఇక్కడికి తీసుకొచ్చింది తియ్యని కబుర్లు చెప్పడానికా, హత్యలూ, రేపుల గురించి చెప్పడానికా?"

"ఆ వార్త చదవగానే నాకు చాల బాధ అనిపిచింది సీతా . అతను ఎవరో; ఎక్కడుంటాడో తెలుసుంటే మిన్నారావ్ మిమ్మల్ని హత్య చేయడానికి ప్లాన్ చేస్తున్నాడు అని అతని దగ్గరకెళ్లి వార్న్ చేసి వుండేవాడిని" బాధగా అన్నాడు.

"నిజమే, నీకలా అనిపించి బాధ కలగడం సహజమే కానీ జరగాల్సింది జరిగిపోయింది. ఇప్పుడు నువ్వేమీ చేయలేవు కదా?"

"ఎందుకు చెయలేను? నాకు తెల్సిన నిజాన్ని పోలీసులకు చెప్పి ఆ మినిస్టర్ మిన్నారావ్‌ని అరెస్టు చేయిస్తా" ఆవేశంగా అన్నాడు బుచ్చిబాబు.

"అప్పుడు ఆ మిన్నారావ్ మనుషులు నిన్ను కూడా నడిరోడ్లో కత్తులతో కసాకసా పొడిచి చంపుతారు. నేను జీవితాంతం ఏడుస్తూ కూర్చోవాలి!" సీరియస్‌గా అంది సీత.

బుచ్చిబాబు తెల్లబోయి ఆమె వంక చూసాడు.

"నువ్వు ఈ పనికిమాలిన విషయాల్లో తలదూర్చి జీవితాన్ని దుర్భరం చేస్తే నేను చచ్చినంత ఒట్టే ఆ చచ్చినవాడు ఎలాగూ చచ్చాడు. మన జీవితం కూడా నరకం చేస్కోడం ఎందుకు"

"అందరూ అలా అనుకుంటే నేరస్థులు హాయిగా తప్పించుకుని తిరుగుతారు".

"నువ్వు చాలా అమాయకుడివి బుచ్చీ. రాజకీయ నాయకులకీ, మినిస్టర్‌లకీ పోలీసుల అండదండలు వుంటాయి కాబట్టే వాళ్లు ఎన్నో రకాల అకృత్యాలు చేస్తుంటారు. నువ్వు నిజము చెప్పాలని పోలీస్ స్టేషన్‌కి వెళ్ళావనుకో అసలు ఆ హత్య చేసింది నువ్వేనని పోలీసులు నిన్ను అరెస్టు చేసి లోపలేస్తారు".

"అంతేనంటావా?" నిరుత్సాహంగా అన్నాడు బుచ్చిబాబు .

"ముమ్మాటికీ అంతే....ఇప్పుడు ఏవైనా చక్కటి కబుర్లు చెప్పు"

"ఏం చెప్పాలబ్బా!" అలోచనగా మొహం పెట్టాడు బుచ్చిబాబు .

"అంతేలే.....నీకు చక్కటి కబుర్లు ఎందుకు తడ్తాయ్.......హత్యల గురించి, శవాల గురించి తడ్తాయిగానీ" బుంగమూతి పెట్టింది సీత .

"మరీ అంత సిల్లీగా మాట్లాడకు."

"పోనీ ఈ విషయం అయిన చెప్పు.... మీ ఫ్రెండ్ సుందర్ నా గురించి ఏమన్నాడు? నేను

నచ్చానా?"

"ఓ....చాలా బాగా నచ్చావ్"

"నచ్చక! పూర్వ జన్మలో ఏదో పుణ్యం చేస్కున్నావ్ కాబట్టే నీకు నేను దొరికాను" గర్వంగా అంది బుచ్చిబాబుతో.

చిరునవ్వు నవ్వాడు.

"నన్ను పెళ్లి చేసుకోవడం నీ జీవితంలో గొప్ప అదృష్టం అన్నాడా?"

"ఊహూ...అలా అనలేదు. అసలు పెళ్లి చేస్కోవద్దు అన్నాడు"

"మరి? ఉంచుకోమన్నాడా?"

"హి హి....." ఇబ్బందిగా కదుల్తూ నవ్వాడు బుచ్చిబాబు.

"అసలు మీ ఫ్రెండ్‌ని చూడగానే నాకు నవ్వాగలేదనుకో.....ఆ పోనీటేయిల్, అ వాలకం....కానీ అతను మూతి ముందుకు పెట్టి నా వైపువస్తుంటే భయపడి చచ్చాననుకో ఎక్కడ గట్టిగ పట్టేస్కుని ముద్దెట్టేస్కుంటాడోనని" నవ్వింది సీత.

"చాల్లే....సిల్లీగా మాట్లాడకు. నేను అక్కడ వుండగానే అలాంటి ఘోరం జరగనిస్తానా? వాడి పోనీటేయిల్ కత్తిరించి పారెయ్యనూ?" ఉడుక్కుంటూ అన్నాడు బుచ్చిబాబు.

"సరేగాని మన పెళ్ళికి మీ సుందర్ వస్తున్నాడా?" అడిగింది సీత.

బుచ్చిబాబు సమాధానం చెప్పలేదు.

"ఏం? రాడానికి కుదరదన్నాడా?" సీతే ఆడిగింది మళ్లీ.

"ఏమో మరి...." నసుగుతూ అన్నాడు బుచ్చిబాబు.

"అహా! అదన్నమాట మీ స్నేహం! అన్నాట్టు పెళ్ళి దగ్గర పడుతోంది. వెడ్డింగ్ కార్డులు ప్రెస్సువాడు ఇంకా ఇవ్వలేదా? ఇంత ఆలస్యంచేస్తే కార్డులు ఎప్పుడు పంచుతాం! పద ఇప్పుడే ప్రెస్సుకెళ్లి అడుగుదాం........... ఎప్పుడిస్తాడో"

"అక్కర్లేదు.....ప్రెస్సువాడు కార్డులు ప్రింట్ చేసి ఇచ్చేసాడు".

సీత సంతోషంగా అరిచింది.

"ఏంటి...ఆ విషయాన్ని ఇంత మెల్లగా చెపుతున్నావా? కార్డులు ఇంట్లో పెట్టి వచ్చావా"

"కాదు .....ఇందులో వున్నాయ్" చేతిలో హ్యాండ్ బ్యాగ్‌ని చూపిస్తూ అన్నాడు బుచ్చిబాబు.

"అహా...ఎంత చల్లగా, మెల్లగా చెప్తున్నావ్ నా తండ్రీ....ఏదీ?"

సీత ఆనందంగా బుచ్చిబాబు చేతిలోంచి హ్యాండ్ బ్యాగ్ లాక్కుని జిప్ తెరిచి దాంట్లో వున్న శుభలేఖల్లోంచి ఒకటి తీసి చూసింది.

"హబ్బ...ఎంత బాగుందో!!చాలా చక్కగా ప్రింట్ చేసాడు కదూ?"

"మనం రేపటి నుండే పెళ్ళి కార్డులు పంచాలి...లేకపోతే టైమ్ సరిపోదు."

"అక్కర్లేదు" మెల్లగా అన్నాడు బుచ్చిబాబు.

“ఏం?”

సీత చేతిలోంచి బ్యాగ్ అందుకుని లేచి నిలబడ్డాడు అతను.

“ఈ పెళ్ళి జరగదు”

సీతా కూడా లేచి నిలబడింది.

“మా నాయనే! ఏం జోక్ చేస్తున్నావా?” నవ్వుతూ అడిగింది సీత.

బుచ్చిబాబు నవ్వలేదు. అతని మొహం సీరియస్‌గా వుంది.

“జోక్ కాదు.... నిజమే చెపుతున్నా!” బుచ్చిబాబు బ్యాగ్‌లోంచి వెడ్డింగ్‌కార్డులు మొత్తం తీసాడు.

“ఈ పెళ్ళి జరగదు” చేతిలోని వెడ్డింగ్ కార్డ్స్ మొత్తం గాల్లోకి విసిరాడు.

సీత కెవ్వున అరిచింది.

కార్డులన్నీ గాలిలో ఎగిరి హుస్సేన్ సాగర్ నీటిలో పడి అలల మీద తేలసాగాయి.

ఊహించని ఈ సంఘటనకి సీత మెదడు మొద్దుబారిపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయ్.

రాత్రి వర్కింగ్ ఉమేన్స్ హాస్టల్లో... సీత బోర్లా పడుకుని ఉంది. ఆమె రూమ్‌మేట్ రాధ చదువుతున్న నవలని ప్రక్కనపెట్టి సీతవంక చూసింది. ఆమెలో కదలికలేదు. బోర్లా పడుకుని మొహం అటుతిప్పి పడుకోవడం చెత ఆమె మొహం రాధకి కనిపించడంలేదు.

నిద్రపోతోందా?

భోజనం చెయ్యకుండా నిద్రపోవడం ఏంటీ?

“సీతా....” మెల్లగా పిలిచింది రాధ.

సీత ఉలకలేదు పలకలేదు.

“సీతా” సీత భుజంమీద తడ్తూ ఈసారి కాస్త గట్టిగా పిలిచింది రాధ.

సీత “ఊ” అంది మెల్లగా.

“లే.....భోజనం చేద్దాం” అంది రాధ.

“నాకాకలిగా లేదు .. నువ్వెళ్ళి భోజనం చెయ్యి”

సీత గొంతులో జీర.

“బానే వుంది. నువ్వు లేకుండా నేను భోజనం చెయ్యడం ఏమిటి రా?”

“ప్లీజ్ రాధ నాకాకలిగా లేదు నన్ను బలవంతం చేయకు”

“పోనీలే ఆకలిగా లేకపోతే కొంచమే తిను. నాకు కంపెనీకోసమయినా రా....లే” సీత వీపుమీద తడుతూ అంది రాధ.

సీత వెల్లకిల తిరిగింది. ఆమె మొహం చూసి ఉలిక్కిపడింది రాధ.

సీత కళ్ళు ఎర్రబారి వున్నాయి. ఆమె కళ్ళవెంట ధారాపాతంగా కన్నీళ్ళు

కారుతున్నాయి.

"ఏంటి సీత ఏమైంది? వంట్లో బాగాలేదా? ఎక్కడయినా నొప్పా"

సీత అడ్డంగా తల ఊపింది.

"మరేంటి? పొద్దున బాగానే వున్నావుకదా సాయంత్రం నీ బుచ్చిబాబుని కూడా కలిసొచ్చావు. హుషారుగా వుండాల్సింది పోయి యిలా ఏడుస్తూ మీ యిద్దరికీ ఏదయినా గొడవచ్చిందా?"

"మా పెళ్ళి కాన్సిల్ అయింది" వెక్కుతూ అంది.

రాధ ఆశ్చర్యపోయింది.

"ఇంతదాకా వచ్చిన తరవాత పెళ్ళి కాన్సిల్ కావడం ఏంటి అయినా ఆ ముసలాళ్ళ కిదేం పోయేకాలం?" ఆవేశంగా అంది.

"పాపం వాళ్ళనేమీ అనకు. వాళ్ళు చాలా మంచివాళ్ళు."